అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 03 జనవరి 2023

అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలి



నోటీసులిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-భిక్కనూర్

నూతన నిర్మాణాలు చేపడుతున్న వారు తప్పనిసరిగా గ్రామపంచాయతీ నుండి అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని ఎంపీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో శ్రీనివాస రైస్ మిల్ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నందున నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు యాదవ్, పంచాయతీ కార్యదర్శి బాబు, వార్డు సభ్యులు, పంచాయతి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆర్య క్షత్రియ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సోమవారం ఆర్య క్షత్రియ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అంకం సిద్దేశ్వర రావు, ఉపాధ్యక్షుడిగా బిక్కజీ వీరేందర్ రావు, కోశాధికారిగా దొడ్లే రాములు, సెక్రటరీగా గడ్డమీది నాగరాజు, రేస్మాయి కమలాకర్ రావు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు సిద్దేశ్వరరావు మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి 'సాయం' ఇంకెప్పుడు?

- వేచిచూస్తున్న లబ్దిదారులు
- ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ప్రకటన
- డబుల్ ఇండ్లకూ ఎదురుచూపులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదల ఇండ్ల నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి దాదాపు నాలుగేండ్లు పూర్తయినా.. అమలు జరగడం లేదు. ఇటీవల స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. 15 రోజుల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దీంతో వందలాది మంది లబ్దిదారులు ఇండ్ల నిర్మాణానికి సాయం దక్కుతుందని ఆశపడ్డారు. కానీ సీఎం చేసిన ప్రకటన.. ప్రకటనగానే మిగిలింది. ఆచరణ రూపం దాల్చుకోలేదు. ఇప్పటికీ లబ్దిదారులు ఎదురుచూపుల్లోనే ఉన్నారు. ఇక డబుల్ బెడ్‌రూం ఇండ్ల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో పూర్తయిన ఇండ్లా పంపిణీకి నోచుకోవడం లేదు.

జిల్లాలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్ధిదారులు ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. కొన్ని చోట్ల నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. అర్బన్‌లో 408 వరకు ఇండ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులకు కేటాయించడం లేదు. గతంలో అర్బన్ లో లబ్ధిదారుల గుర్తింపు కోసం దశలవారీగా విచారణ చేపట్టినప్పటికీ ఇంకా అర్హులను గుర్తించడం లేదు. జిల్లాలో ప్రభుత్వం నుంచి 14,825 ఇండ్లు మంజూరు అవగా ఇప్పటివరకు 2,103 ఇండ్లు నిర్మాణం మాత్రమే పూర్తయింది. మరో 7161 ఇండ్ల నిర్మాణాలు పలు దశలో ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన ఇండ్లు తమకు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అయితే రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం ప్రకటిస్తామని ప్రకటించింది. డబుల్ బెడ్ రూం ఇండ్లలో స్థల సేకరణకు, ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు తలెత్తడంతో సర్కారు ఈ ప్రకటన చేసింది. ఖాళీ స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ రుణంలా కాకుండా ఉచితంగా రూ.5 లక్షలు అందజేస్తామని ప్రకటించింది. కానీ చాలా సంవత్సరాల పాటు ఈ హామీ అటకెక్కింది. అయితే సర్కారు ఇటీవల మళ్లీ ఈ హామీకి సంబంధించి ప్రకటన చేసింది. త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తామని తెలిపింది. అయితే ఇంటి సాయం రూ.5 లక్షల బదులుగా.. రూ.3 లక్షలు అందజేస్తామని ప్రకటించింది. ఇది ప్రకటించి కూడా దాదాపు సంవత్సరం కావొస్తున్నా.. స్పందన లేదు. కానీ ఇటీవల స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. 15 రోజుల్లో దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గృహనిర్మాణ ముడి సరుకు ధరలు భారీగా పెరిగాయి. సలాక, సిమెంట్, ఇసుకతో పాటు కంకర, కలప ఇలా ప్రతిదీ ఆకాశన్నంటుతున్నాయి. సామాన్య ప్రజలు ఇంటి నిర్మాణం అంటేనే హడలెత్తుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత సాయం వస్తే.. అప్పోసప్పో చేసి స్వంతంటి నిర్మాణ కల నెరవేర్చుకుందామని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త్వరగా దరఖాస్తులు స్వీకరించి నగదు అందజేయాలని బాధితులు కోరుతున్నారు.



ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 61 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. ప్రజావాణిలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఆర్డిఓ సాయన్న, ఏవో రవీందర్, జిల్లా అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశ పరీక్ష దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

జవహర్ నవోదయ విద్యాలయం ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తులను ఆన్‌లైన్లో స్వీకరిస్తున్నట్లు నిజాంసాగర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ హరివర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 29 వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అయ్యప్ప స్వామిని దర్శించుకున్న షిండే



అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే షిండే, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-బిచ్కుంద/జుక్కల్/నిజాంసాగర్

కేరళ రాష్ట్రంలోని శబరిమలైకు వెళ్లిన జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే.. పంబ నది నుండి కాలినడకన అయ్యప్ప స్వామి సన్నిధానానికి చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. గత 16 సంవత్సరాల క్రితం మొదలైన ఈ యాత్ర ప్రతి సంవత్సరం కాలినడకన 14 సార్లు దర్శించుకున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి మొదటి తేదీన శబరిమలై వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ చేసుకొని యాత్ర కొనసాగడం అదృష్టగా భావిస్తున్నానని ఈ సంవత్సరం అయ్యప్ప స్వామి దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జుక్కల్ నియోజకవర్గంలో పంటలు పుష్కలంగా పండి, వ్యాపారాలు అభివృద్ధి చెంది జుక్కల్ నియోజకవర్గంలోని రైతులు, వ్యాపారస్తులు, ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెంది దేశంలోనే మొదటి స్థానంలో నిలవాలని కోరుకున్నట్లు ప్రకటన ద్వారా ఎమ్మెల్యే హనుమంత్ షిండే తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఉమ్మడి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ధఫేదార్ రాజు, మద్నూర్ ఏఎంసీ చైర్మన్ సాయగౌడ్, పీఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుశల్, పెద్దకొడప్ గల్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరిరాజు, నియోజకవర్గ సీనియర్ నాయకులు సురేష్ గౌడ్, పాకల్ వార్ విజయ్ ఉన్నారు.

జెఈఈ, నీట్, ఎంసెట్‌కు ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక శిక్షణ

- డిఐఇఓ రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరు కావడానికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్య అధికారి (డిఐఇఓ) రఘురాజ్ సోమవారం తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుండి ఈ ప్రత్యేక తరగతులను ప్రారంభించామని డిఐఈఓ అన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తూ వారిని ఎంసెట్, నీట్, జేఈఈ పరీక్షలకు సిద్ధం చేస్తామని అన్నారు. కార్పొరేట్ కళాశాలలో లక్షల ఫీజులు చెల్లించి విద్యనభ్యసిస్తున్న వారికి ధీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా మెటీరియల్, పుస్తకాలను అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు అన్ని సౌకర్యాలను కల్పించి ఇంటర్ విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రత్యేక శిక్షణ నిర్వహించిన తర్వాత ప్రతి విద్యార్థినికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి నిష్ణాతులైన అధ్యాపకులతో ఎంపిక చేసిన విద్యార్థులకు రెసిడెన్షియల్ కళాశాలలో మరో సారి ప్రత్యేక శిక్షణ ద్వారా పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న అధ్యాపకుల తో ఎంసెట్, నీట్, జేఈఈ పోటీ పరీక్షలకు హాజరు కాబోయే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. మార్చి 15 నుండి జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తూ అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూప్ లలో విద్యాభ్యాసంలో వెనుకబడిన వారిని గుర్తించి ఉదయం 9 గంటల నుంచి 9 గంటల 45 నిమిషాల వరకు సాయంత్రం 4 గంటల 30 నిమిషాల నుండి 5 గంటల 30 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని అన్నారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు గాను అన్ని కళాశాలలో శిక్షణ నిర్వహిస్తూ విద్యార్థులకు సన్నద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ ఇంటర్ విద్య కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది హాజరు వేళలను నమోదు చేసేందుకు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించిందని తెలిపారు. ఒక్కో కళాశాలకు రెండు బయోమెట్రిక్ డివైసులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రతి కళాశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.డం జరుగుతుందని కళాశాలలో ఎలాంటి వసతులకు కొదవలేదని అన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పిల్లలకు బాలామృతం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-జుక్కల్

బమండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ తండాలోని మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ రాధ ఆధ్వర్యంలో సోమవారం అక్షరాభాస్యం నిర్వహించినట్టు తెలిపారు. సూపర్ వైజర్ సమక్షంలో పిల్లల బరువు, ఎత్తు, కొలతలు తీసుకుని రికార్డులో నమ్మోదు చేసారు. బలహీనంగా ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా పోషక విలువలు అందే బూస్టర్ బాలమృతం అందించారు. అనంతరం సూపర్ వైజర్ వినోదా మాట్లాడుతూ గర్భిణిలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార నియమాలను, టీకాలను, రక్తహీనత ఉన్నవారికి ప్రత్యకంగా గుర్తించి వారికి వైద్యసేవలందించేందుకు ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచనలతో వైద్యం చేయించడంలో టీచర్ శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భిణిలు, బాలింతలు సహకారించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వినోదా, టీచర్ రాదా, ఆశా వర్కర్, పిల్లల తల్లిదండ్రులు, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

పంటినొప్పి బాధ భరించలేక మహిళ ఆత్మహత్య




నవతెలంగాణ-భిక్కనూర్


చెరువులో దూకి మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అనసూయ (57) గత కొంతకాలంగా పంటి నొప్పితో బాధపడుతుంది. పంటి నొప్పి బాధ అధికమవడంతో ఆ బాధ భరించలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ ఆనంద్ గౌడ్ తెలిపారు.

రెండు గౌడ కుటుంబాల కులబహిష్కరణ

- ప్రాణంగా పెంచుకున్న ఈతవణంతో ప్రాణభయం
- తమ సొంత భూమిలో పెంచుకున్న ఈతవనాన్ని
- సంఘానికి ఇవ్వాలని బెదిరిస్తున్నారని బాధితులు కన్నీరు



ఈత వనంలో పెరిగిన చెట్లు



ఈత చెట్లు నరికేస్తామని బెదిరించడంతో అక్కడే రేకులతో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న బాధితులు

నవతెలంగాణ-ధర్పల్లి

ధర్పల్లి మండల కేంద్రంలోని గౌడ సంఘం తమ సంఘ సభ్యుల్లోని రెండు కుటుంబాలకు గత 6 రోజుల క్రితం కుల బహిష్కరణ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సొంత పట్టా భూమిలో ఈత వనం సాగు కోసం మొక్కలు నాటి నాలుగేండ్ల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచుకోగా.. ప్రస్తుతం కల్లు వచ్చే సమయంలో ఆ చెట్లను సంఘానికి ఇవ్వాలని తమ కులపెద్దలు హుకుం జారీ చేశారని, అందుకు ఒప్పుకోకపోవడంతో తమను కులం నుంచి బహిష్కరించినట్టు బాధితులు లింగాల రాజేశ్వర్ గౌడ్, లింగాల శ్రీనివాస్ గౌడ్ నవతెలంగాణకు తమగోడును వెల్లబోసుకున్నారు. కేవలం నలుగురు వ్యక్తులు ఇదంతా చేస్తూ తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. సొంతంగా కొనుగోలు చేసిన 195 సర్వేనంబర్‌లోని 4 ఎకరాల భూమిలో హరిత హారం కింద 2018 సంవత్సరంలో 16 వందల ఈత మొక్కలను నాటుకున్నారు. ఈత వనం ప్రారంభించేందుకు అప్పటి జిల్లా కలెక్టర్ రామ్మోహన్ రావ్, తహసీల్దార్ రమేష్, ఎంపిడిఓ గణపతి,ఎక్సయిజ్ సిఐ శామ్ సుందర్, ఎస్ఐ నర్సింలు సమక్షంలో మొక్కలను నాటారు. తమ భూమిలో తాము పెంచుకున్న చెట్లను తామే కళ్ళు గీసుకుంటామని సంఘ సభ్యులకు తెలిపినప్పటికీ అప్పుడు అడ్డు చెప్పని సంఘం సభ్యులు నేడు ఈతవనంలో ఏపుగా పెరిగిన చెట్లు కళ్ళు వచ్చే సమయానికి సంఘంలోని నలుగురు సంఘ సభ్యుల కండ్లు మండి తమపై కుల సభ్యులకు లేనిపోని అపోహలు ఉసిగొలిపి మాపై వెతిరేకంగా మాట్లాడేవిధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 6 రోజుల క్రితమే తమ రెండు కుటుంబాలకు బహిష్కరిస్తున్నట్లు సంఘంలో కొందరు చర్చించి తీర్మానించినట్లు తెలిపారు. అప్పటి నుండి తమ సంఘం వారు తమతో ఎవ్వరు మాట్లాడటంలేదని, మా ఇండ్లల్లోకి రావడంలేదని వాపోయారు. కొందరు మా చుట్టాలు మాట్లాడిన ప్పటికీ అది తెలుసుకొని వారికీ దబాయించినట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించినట్లు వాపోయారు. తాము చావనైనా చస్తాము కానీ చెట్లను మాత్రం వదులుకోబోమని బాధితులు స్పష్టం చేస్తున్నారు. చెట్లను నరికివేస్తామని బెదిరింపులకు పాల్పడటంతో ఈతవనంలోని నివాసం ఏర్పరుచుకొని రాత్రిం పగళ్ళు అక్కడే కావలా ఉంటున్నారు. న్యాయ స్థానాన్ని ఆశ్రయించామని అన్నారు. సంఘంలోని నలుగురు వ్యక్తులే కావాలని ఇతరులకు మాపై రెచ్చకొడుతున్నారని ఆవేదన వెక్తం చేశారు. తమ గోడు వినిపించుకొని తమకు న్యాయం చెయ్యాలని అధికారులకు బాధితులు వేడుకుంటున్నారు.

నేషనల్ సబ్ జూనియర్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-తాడ్వాయి



ఢిల్లీలో జరగనున్న సబ్ జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు రిఫరీగా జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాలు (బాలయ్య) ఎంపికయ్యారు. దీంతో ఆయనను పాఠశాల హెడమాస్టర్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గజ్జెల రమేష్ బాబు, సెక్రెటరీ హన్మంత్ రెడ్డి, నిజామాబాదు జిల్లా సెక్రటరీ మల్లేష్ గౌడ్, తెలంగాణ రిఫరీస్ బోర్డు చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్ రెడ్డి అభినందనలు తెలియజేసారు.

నేడు గల్ఫ్ బాధితుల సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అనేక వందల మందిని వివిధ దేశాలకు విజిట్ వీసా పై పంపి మోసగించిన గల్ఫ్ ఏజెంట్ చిక్కెల స్వామి ద్వారా మోసపోయిన జిల్లా వాసులందరూ నేడు నిజామాబాద్‌లో జరిగే సమావేశానికి హాజరుకావాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు సోమవారం తెలిపారు.. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రైల్వే స్టేషన్ దగ్గర సమావేశం ఉంటుందన్నారు. అనంతరం కమిషనర్‌ను కలిసి స్వామి వసూలు చేసిన కోట్లాది రూపాయలు తిరిగి ఇప్పించాలిని కోరనున్నట్టు తెలిపారు. స్వామి ఇటీవల 250 మందిని దుబాయ్‌కి, వివిధ దేశాలకు పంపి మోసగించారన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



దత్త్రాతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ సంస్థ తరపున విద్యార్థులకు నీరడి దత్త్రాతి వ్యక్తిత్వవికాస కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధి నీరడి దత్త్రాతి మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే క్రమశిక్షణతో సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోధ్యాయులు టి.కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

- విద్యార్థులకు దుప్పట్లు, నోట్‌బుక్‌లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్-2023 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఎన్నికైంది. క్లబ్ అధ్యక్షులుగా జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ సి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు, జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ఈగ గంగారెడ్డి, క్లబ్ సెక్రటరీగా కాంట్రాక్టర్ గడ్కోల్ సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీగా రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి బి.రామరాజు, ట్రెజరర్‌గా రిటైర్డ్ ఎటీఓ ఏ.శంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు నల్లవెల్లి కుంట శ్రీనివాస్ రెడ్డి, రాంప్రసాద్ తెలిపారు.ఈ నూతన కార్యవర్గం ఏడాది కాలం పాటు కొనసాగుతుందని వారు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలను చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్లబ్ అధ్యక్షులు సి నారాయణరెడ్డిని, ఉపాధ్యక్షులు పోలీస్ కమిషనర్ కె.ఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి చేతుల మీదుగా పేద విద్యార్థుల కోసం దుప్పట్లు, నోట్ బుక్స్, పెన్సిల్లు అందజేశారు. భవిష్యత్తులో క్లబ్ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడతామని, పలు సామాజిక, సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని సెక్రటరీ గడ్కోల్ సంజీవ్ రెడ్డి తెలిపారు.

మహిళ మహనీయుల మాసోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-కంఠేశ్వర్

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి మహిళ మహనీయుల మాసోత్సవాలు మంగళవారంనుండి ఈనెల 7వరకు చేస్తున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ చేతులమీదుగా పోస్టర్ల ఆవిష్కరణ సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యశోధక్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు, బివిఎం జిల్లా అధ్యక్షులు రాహుల్, ఏ వై ఎస్ సలహాదారులు కొమ్ము రాజమల్లు, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ నుంచి బాగేపల్లి వరకు సీసీ రోడ్డు పనులను సర్పంచులు పాముల సాయిలు, రొడ్డ విజయ లింగం ప్రారంభించారు. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో ప్రారంభించారు. కార్యక్రమంలో బాగేపల్లి ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పి ఆర్ ఏ ఈ లికిత, యువకుల పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
మంగళవారం 03 జనవరి 2023

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలను సోమవారం అంగన్వాడీ సూపర్ వైజర్ నాగలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల బరువులు, ఎత్తులు పరిశీలించారు. లబ్ధిదారులకు గుడ్లు, బాల అమృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, లక్ష్మీ గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులున్నారు.

వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించండి

- పశుమిత్రల నిరసన, ప్రజావాణిలో వినతి
- ప్రజావాణికి 81 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న పశుమిత్రలకు వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి, ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పారితోషకం లేకుండా పనిచేస్తున్నామని వాపోయారు. పశుసంవర్ధకశాఖలో రాష్ట్రవ్యాప్తంగా 2500 మంది పశుమిత్రలు ఎనిమిది సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. అందులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని తెలిపారు. సబ్ సెంటర్ పరిధిలోని పశువులు, జంతువులకు ఆరోగ్య సమస్యలు వస్తే ఏ సమయంలోనైన వెళ్లి సేవలు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పారితోషికం, వేతనం నిర్ణయం చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. జీఓ. 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పశుమిత్రలు లక్ష్మీ, జి.మౌనిక, స్వప్న, మమత, విమల, సంగీత, రమ్య అరుణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 81 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుల పెన్షన్‌పై ఆంక్షలు ఎత్తివేయాలి

గీత కార్మికుల పెన్షన్‌పై ఆంక్షలు ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర గీతపనివారల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.విట్టల్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతాపనివారల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ.విట్టల్ గౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికులకు పెన్షన్ కార్డులను పంపిణీ చేసినప్పటికీ పెన్షన్‌దారుల వారసులకు వాహనాలు ఉన్నాయనే లింకు పెడుతూ ఇవ్వడంలేదని అన్నారు. గీతా కార్మికుల పెన్షన్లపై ఎలాంటి లింకు పెట్టకుండా వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గీతా కార్మికులకు ఆసరా పెన్షన్ బదులుగా వృత్తి పెన్షన్ మంజూరు చేయాలని అన్నారు. వయసుకు సంబంధం లేకుండా ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం గీతా కార్మికులకు ప్రమాదవశాత్తు ఇచ్చే ఎక్స్ గ్రేషియా కాకుండా రైతు బీమా మాదిరిగా గీతా కార్మిక భీమా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సంతోష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బండి నారా గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బి.పండరి గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పశుమిత్రలు



కలెక్టర్‌ను కలిసిన పెన్షనర్స్

ఈఎస్ఐ ఆస్పత్రిలో వెల్‌నెస్ సెంటర్

కంఠేశ్వర్:ఎంప్లాయిస్, జర్నలిస్ట్ పరిధిలో పనిచేస్తున్న వెల్నెస్ సెంటర్‌ను అన్ని వసతులతో కూడిన ఈఎస్ఐ హాస్పిటల్ లోకి మారుస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ట్రస్ట్, ఇతర అధికారులతో చర్చించి నిర్ణయించినట్లు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ప్రతినిధులు వెల్‌నెస్ సెంటర్‌పై కలెక్టర్‌తో చర్చించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో చర్చించిన ఈ నిర్ణయానికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపినట్లు సంఘ నాయకులు రామ్మోహన్‌రావు తెలిపారు. అన్ని వసతులతో న్యాల్‌కల్ రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రి సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్రావు, సంఘ జిల్లా నాయకులు మదన్ మోహన్, ఈవీఎల్ నారాయణ, సుదర్శన్ రాజు, అందే సాయిలు, ప్రసాద్ రావు, రాధాకిషన్, పుండరీ, రామదాసు, తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న గీతకార్మికులు

20 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

20 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడిన వారితోపాటు వెనుక కూర్చున్న వారికి కలిపి 36 మందికి సోమవారం నగరంలోని నిజామాబాద్ జిల్లా టిటిఐ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-బోధన్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం బోధన్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగా రెడ్డి, మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. సంధర్భంగ ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన ఆలయ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని కోటయ్య క్యాంప్‌లోగల శ్రీ సాయిరాం మందిరం అభివృద్ధి పనులను సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ గోరపాటి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీ సాయిరాం మందిరంలో భోజనశాల షెడ్డు, ఇతర సౌకర్యాలను కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి 10 లక్షల రూపాయలను మంజూరు చేయించారని తెలిపారు మరో ఆరు లక్షల రూపాయలను ఆలయ కమిటీ ద్వారా పనులను చేస్తున్నట్టు చెప్పారు. సహకరించేవారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన దాతలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. మేదరి సూర్య, కె.చరణ్ దాతలు క్రీడా దుస్తులను వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీపోటీలకు తూంపల్లి విద్యార్థినులు

నవతెలంగాణ-సిరికొండ

రంగారెడ్డి జిల్లాలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు తుంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కంచర్ల అక్షయ, బాదావత్ శ్రీజ,బాదావత్ అఖిల ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు నాగేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి హాకీ పోటీలు జనవరి చివరి వారంలో న్యూ ఢిల్లీలో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారిణులను ప్రధానోపాధ్యాయులు సైర సత్యం, జిల్లా సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, సెక్రెటరీ రమణ, కోశాధికారి సురేందర్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాటు

నవతెలంగాణ-ముప్కాల్



మండలంలోని రెంజర్ల గ్రామ ఉపసర్పంచ్ మగ్గిడి మోహన్ రెడ్డి తనవంతు సాయంగా కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి, ఆలయ అభివృద్ధికి తోడ్పాటుగా రూ. 25,116 రూపాయలను విరాళంగా అందజేశారు.. ఈ సందర్భంగా సోమవారం ఉప్లూర్ ఆలయ కమిటీ సభ్యులక్కు విరాళం డబ్బులను అందజేశారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఉప్లూర్ ఆలయ కమిటీ సభ్యులు మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

మనఊరు-మనబడి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-మెండోర

దూదిగం , బుస్సాపూర్ గ్రామాల పాఠశాలలలో కొనసాగుతున్న మనఊరు-మనబడి పనులను మండల ప్రత్యేక అధికారి డిఎల్‌పీఓ పొన్నూరు వెంకట శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. పనులు నాణ్యత గా ఉండాలని, వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం సర్పంచ్‌లలు, ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, సర్పంచులు పాల్గొన్నారు.

అదనపు గది ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్



అదనపు గదిని ప్రారంభిస్తున్న సర్పంచ్

మండలంలోని దూపల్లి ప్రైమరీ పాఠశాలలో మన ఊరు మన బడిలో నిర్మించిన అదనపు గదిశ్రీతీ సర్పంచ్ శనిగరం సాయి రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ కంచ సాయిలు, ఎంపిటిసి మొగులబాయి, ప్రధానో పాధ్యాయులు దేవిదాస్, పీఆర్టియూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయి రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు లింగన్న యాదవ్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ శ్రీనివాస్, బాబన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి

- ప్రగతిశీల రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లిలో రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాయకులు ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్ కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... మండల కేంద్రంలో సుమారు 60 సంవత్సరాల నుండి బోధన్-నిజామాబాద్‌కు రైలు రాకపోకలు కొనసాగుతుండేవన్నారు. నాలుగు సంవత్సరాలకాలం నుండి నిజామాబాద్ నుండి బోధన్ వైపు వెళుతున్నప్పటికీ ఎడపల్లిలో రైల్వే స్టేషన్‌లో ఆపడం లేదని తెలిపారు. ఎడపల్లిలో రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరిస్తే సుమారు 8 గ్రామాల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గుమ్ముల గంగాధర్, ఎస్కే నసీర్, పోశెట్టి, సాయిలు, మల్లేష్, తదితరులున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నేడు వంటవార్పు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌ను జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగారెడ్డి సోమవారం ప్రకటించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు...

బోధన్‌ను జిల్లాగా చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 15వ రోజు నిర్వహించిన దీక్షల్లో న్యాయవాదులు ఎమ్.గంగారెడ్డి, అర్జున్ ర్యాండర్, పి.శంకర్ లు కూర్చున్నారు .దీక్షలకు న్యాయ వాదులు సిహెచ్‌వి. హన్మంతరావు, శేఖర్ బోధన్కర్, తర్ల శంకర్, బానోత్ రమేష్, కోటేశ్వరరావు, ఖాసిం భాషా, ఈశ్వర్, నాయక్ సాయిలు, దత్తాత్రేయ కులకర్ణి, గంగాధర్ గౌడ్, గుమస్తా, వై.గంగాధర్ ,జమీర్ ఖాన్,ఖైషర్, శ్రీనివాస్, కేషవ్ సంఘీభావం తెలిపారు.

భద్రతతో ఈవీఎం గోడౌన్ మరమ్మతు పనులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగుతున్న మరమ్మతు పనులను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తీసి, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని అన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లోనే పూర్తి స్థాయిలో సదుపాయాలు కలిగి ఉన్న గదుల్లో భద్రపర్చాలని, ఏ చిన్న వస్తువు కూడా బయటకు వెళ్లకుండా నిఘా ఉంచాలన్నారు. షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా నాణ్యమైన సామాగ్రిని వినియోగిస్తూ, విద్యుత్ సంబంధిత పనులను పక్కాగా జరిపించాలన్నారు. వచ్చే ఆదివారం నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. మరమ్మతు పనుల్లో పాల్గొనే వారి పూర్తి వివరాలు సేకరించాలని, ఆధార్ జిరాక్స్, సెల్ ఫోన్ నెంబర్ తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, పంచాయతీ రాజ్ ఈ.ఈ శంకర్ రాథోడ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ప్రజాసమస్యలపై గళమెత్తి పాడిన కళాకారుడు సఫ్దార్ హస్మి

నవతెలంగాణ-బోధన్

ప్రజా సమస్యలపై తన గళం విప్పి వారికి అండగా నిలిచిన గొప్ప కళాకారులు సఫ్దార్ హస్మి అని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసి పేటలో సఫ్దార్ హస్మి వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలను సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిర్పలింగం మాట్లాడుతూ. జననాట్య మండలి వ్యవస్థాపకులు సఫ్దార్ హస్మి విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో చేరి ఆ తర్వాత సీపీఎం పార్టీలో పనిచేశారని, అనంతరం జననాట్యమండలి ద్వారా కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. స్థానిక సమస్యలను , ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన కళ్ళకు కట్టినట్లు చూపారన్నారు. అనేక నాటికలు రచించి కొత్త ప్రక్రియ నుక్కడ్ ద్వారా నాటికలతో మహిళలపై, కార్మికులపై హల్లాబోల్ అనే నాటికను అనేక చోట్ల ప్రదర్శించారని అన్నారు. ఈ నాటిక ప్రదర్శిస్తున్న సమయంలో కాంగ్రెస్ గుండాలు వచ్చి అవాంతరం కలిగించి ఆయనను హత్య చేశారన్నారు. అనంతరం నాటక బృందం కళాకారులు అక్కడే మళ్లీ అదే నాటికను ప్రదర్శించారని అన్నారు. ఆ కళాకారుని స్ఫూర్తితో ఐక్య సంఘటన పోరాటంలో కార్యక్రమాలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మటపతి గంగాధరప్ప, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్, తెలంగాణ ఆల్ పెన్షన్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకట్రావు, పిఎస్ఎమ్ జిల్లా నాయకులు మద్దెల గంగారాం, ప్రజానాట్యమండలి బోధన్ నియోజకవర్గ నాయకురాలు సావిత్రి, పీఎస్ఎమ్ బోధన్ మండల నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, రహిమూద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సఫ్దార్ హస్మికి నివాళ్లు అర్పిస్తున్న కళాకారులు

అత్యవసర సేవలపై అవగాహన

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్ బండార్ గ్రామంలో అత్యవసర సేవలపై టెన్ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్ బెటాలియన్ ఎన్ఆర్ఎఫ్ఎం ఇన్‌ఛార్జ్ ఇన్‌స్పెక్టర్ బిట్వీన్ సింగ్ మాట్లాడుతూ అకస్మాత్తుగా వరదలు వచ్చినప్పుడు, బిల్డింగులు పడిపోయినప్పుడు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శంకర్, కార్పొరేటర్ రాయసింగ్, ఏఎస్ఐ గంగాధర్, గౌస్, ఆర్ఐ షఫీ, ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అత్యవసర సేవలపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఆర్ఎఫ్ఎం ఇన్‌ఛార్జి

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను తహశీల్దార్ గఫ్ఫార్ మియా, ఎఫ్ ఎల్ఎన్ నోడల్ అధికారి రాములు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.... క్యాలెండర్‌లో దేశభక్తి, సంస్కృతి పునరుద్ధరణ కు ప్రాణ త్యాగాలు చేసిన వీరుల జీవన విశేషాలు, క్యూఆర్ స్కానర్‌లో నిక్షిప్త పరచడం ద్వారా విద్యార్థులకు, వారి జీవిత చరిత్ర, ఘట్టాలు తెలుసు కోవడం చాలా ఉపయోగమన్నారు. ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి రాములు మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం తపస్ వారు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సేవ కార్యక్రమాలు చేస్తుంటారని అభినందించారు. కార్యక్రమంలో సిరికొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సీతాదేవి గడ్కోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్ సింగ్, తెలంగాణ ఆశ్రమ పాఠశాల సిరికొండ గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు కల్పన, న్యావనంది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గంగాధర్,తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రాచర్ల గంగాధర్, మండల అధ్యక్షులు దుబ్బాక నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్, మండల గౌరవ అధ్యక్షులు మోతిలాల్ ఉపాధ్యాయులు, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

అనుచిత వాఖ్యలపై ఖండన

నవతెలంగాణ-ఆర్మూర్

బైరి నరేష్ చేసిన వ్యాఖ్యలను భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆర్మూర్ డివిజన్ కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసి అల్లర్లకు కారకుడైన బైరి నరేష్‌పై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు అరేపల్లి సాయిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్ సబ్బండ వర్గాల వారికి మేలు కోరి రాజ్యాంగం రచించారని, సభలో ఆయన ఫొటో పెట్టుకుని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ఒకే మతం వారి మనోభావాలను కించపర్చడం సరైంది కాదని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ వారు బైరి నరేష్ పై చట్టరిత్యా తగు చర్యలు తీసుకుని ముందు ఇలాంటి హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఎవరి మతాలను వారు గౌరవించుకుంటారని, ఇతర మతాలను తక్కువ చేసి మాట్లాడడం సబబు కాదని తెలిపారు.

ఆలయాలు కిటకిట



ఆలయంలో బారులు తీరిన సందర్శకులు

నవతెలంగాణ-పిట్లం

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని పలు గ్రామాల్లో వెంకటేశ్వర ఆలయాలు సందర్శకుల తాకిడితో కిటకిటలాడాయి. పిట్లం మండల కేంద్రంతో పాటు రాంపూర్‌లోని వెంకటేశ్వర ఆలయాలల్లో ఉత్తర ద్వార గుండా వెళ్లి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయాలలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రూ.2 లక్షల ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 11వ వార్డు లింగారెడ్డి పెటకు చెందిన సి ఎచ్ లింగవ్వ అనారోగ్యంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఎమ్మెల్యే సురేందర్ సహకారం తో సోమవారం ఆసుపత్రిలో 2 లక్షల ఎల్‌వోసీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుకు కౌన్సిలర్ రాము అందజేశారు. ఆయన వెంట సీనియర్ నాయకులు శ్రీనివాస్ నయక్, మనోజ్ తదితులున్నారు.

భోజనం తినలేకపోతున్నం

- దాబాల్లో గురుకుల విద్యార్థుల భోజనం



దాబాలో టిఫిన్ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని సిద్దరామేశ్వర గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భోజనం సరిగ్గా పెట్టడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ చేస్తున్న వంట తినలేకపోతున్నట్టు పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దగ్గరలోని దాబాలో పలుమార్లు టిఫిన్ చేస్తూ, భోజనం చేస్తూ కంటపడుతున్నారు. ఈ విషయమై ఆరా తీయగా.. కొన్ని సార్లు గురుకులంలో పెడుతున్న భోజనం తినలేకపోతున్నామని వాపోతున్నారు. ఉపాధ్యాయులకు తెలిసి వచ్చారా.. చెప్పకుండా వచ్చారా అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకపోతున్నారు.

నాసిరకంగా అహారం

గురుకుల పాఠశాలలో ఉదయం టిఫిన్, భోజనం సరిగ్గా ఉండడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యార్థులు భోజనం చేసేందుకు బయటకు వస్తున్నారు. భోజనం విషయంలో పట్టించుకోవల్సిన పాఠశాల ప్రిన్సిపాల్ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం, పరిశీలన లోపం కారణంగా నాసిరకంగా వంటలు చేస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు..?

గురుకులం 44వ జాతీయ రహదారి పక్కన ఉంది. బయటకు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. హాస్టల్ వార్డెన్ కు, ప్రిన్సిపాల్ కు ఇదంతా తెలిసి జరుగుతుందా తెలియక జరుగుతుందా తెలియాల్సి ఉంది. పాఠశాలను పట్టించుకోవాల్సిన ప్రిన్సిపాల్ అసలు పాఠశాలలో ఉన్నరా..?, ఇదంత తెలిసినా పట్టించుకోకుండా ఏమి చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ



విద్యార్థులకు బూట్లు అందజేత

నవతెలంగాణ-బోధన్

సాలుర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన అజయ్ రెడ్డి తన కుమారుడు దొడ్ల శ్రేయస్ రెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు షూలు, పుస్తకాలు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు రవీందర్ రెడ్డి, అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థలతో

ఉచిత న్యాయ సేవలు, సహాయం

- రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- రాజ్యాంగం ప్రకారం న్యాయ సేవలు పొందడం ప్రతి ఒక్కరి హక్కు
- రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పి. నవీన్ రావు
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థను వర్చువల్ విధానంలో ప్రారంభించిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి





న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి..

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రతి ఒక్కరికీ న్యాయం పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందే విధంగా జిల్లా న్యాయ సేవాధి కార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సేవలు, సహాయం అందిస్తామని రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లా కేంద్రాల్లోని కోర్టు ప్రాంగణాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించి మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేద ప్రజలు, ఒంటరి మహిళలు, నిరక్షరాస్యులు ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచిత న్యాయ సలహా దొరుకుతుంద న్నారు. ఉచితంగా సేవలు అందుతాయనే విషయం అందరికీ తెలియజేయాలని అన్నారు. దేశంలోని ప్రతి మహిళకు, ఎస్సి/ ఎస్టిలకు, కార్మికులకు, దివ్యాంగులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికి న్యాయం పొందే హక్కును కల్పించినట్టు తెలిపారు. ఇది పూర్తి స్థాయిలో అమలు అయ్యేందుకు 1995లో న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి 10 జిల్లాల్లో జిల్లా స్థాయి న్యాయ సేవాధికార సంస్థలు ఉన్నాయని, ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాలలో సైతం జిల్లా స్థాయి న్యాయాధికార సేవా సంస్థల ను ఏర్పాటు చేయడంలో సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా న్యాయ అధికార సేవా సంస్థల ద్వారా అందించే సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని, పేద ప్రజలు సేవలు వినియోగించు కోవాలని ఆయన సూచించారు. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీదేవి మాట్లాడారు. కక్షిదారులు అందరూ తమ సమస్యలను న్యాయ సేవాదికార సంస్థను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని, సంస్థ సేవలను, అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ కలెక్టర్ శివేంద్రప్రసాద్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.1000 కోట్లతో

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

రూ.1000 కోట్లతో తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని దోమకొండ ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు నాగారపు రాములు డిమాండ్ చేశారు. సోమవారం దోమకొండ పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతు ముదిరాజుల అందరికీ ఉపాధి కల్పన పనులు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో 50 లక్షల మంది జనాభా ఉన్న ముదిరాజులు ఉపాధి పనులు లేక ఉద్యోగాలు లేక నానా బాధలు పడుతున్నార అన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ముదిరాజులను బీసీ డీ గ్రూపు నుండి ఏ గ్రూపులోకి మార్చుతూ జీవో విడుదల చేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి పీరియడ్‌లో ముదిరాజులను బిసి ఏ గ్రూపులోకి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ముదిరాజులను ఏ గ్రూపులోకి మార్చాలని తీర్పునిచ్చిందని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో ముదిరాజులు చదువులలో రిజర్వేషన్ లేక ఉద్యోగాల్లో రిజర్వేషన్ లేక ఉపాధికి నిధులు లేక నానా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని సంక్షేమ సంఘం ప్రతినిధులు వాపోయారు. అటవీ ఉత్పత్తులు అమ్ముకుంటూ ముదిరాజుల జీవిస్తున్నారని సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శిగా అబ్రబోయిన సిద్దరాములు, కోశాధికారిగా భూపాల్ నందు, ఉపాధ్యక్షులుగా బట్టు శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా నీల నాగరాజు, సభ్యులుగా అబ్రబోయిన చంద్రయ్య, పులవోయిన శంకర్, బట్టు నారాయణ, నాగారపు గంగాధర్, కామిండ్ల రాజు, కామిండ్ల అంజయ్య, ముత్యంపేట నారాయణ, బట్టు రవితేజ, నాగారపు రాజీవ్, అబ్రబోయిన నరసింహులు కార్యదర్శులు ఉన్నారు. దోమకొండ మండల కేంద్రం లోని పెద్దమ్మ ఆలయం లో సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం సభ్యులు

వెంకన్న సేవలో బీబీపాటిల్



బీబీ పాటిల్ దంపతులు

నవతెలంగాణ-జుక్కల్

వైకుంట ఏకాదశి పురస్కరించుకొని ఎంపీ బీబీ పాటిల్ దంపతులు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరినట్టు తెలిపారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం భవానిపేట గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మల్కాపురం జీవన్, ఉపాధ్యక్షులుగా నాగులూరి పెద్ద మరియవ్వ, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు, తరుణ్, కార్యదర్శిగా పోతరాజు, హరీష్, సలహాదారులుగా బేగారి లక్ష్మణ్ పోతరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాటు పడతామని అలాగే అంబేద్కర్ సిద్ధాంతాలు, అంబేద్కర్ గారి బాటలో నడుస్తామని తెలియజేశారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునికి సన్మానం



కైలాస్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన కైలాస్ శ్రీనివాస్‌ను గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బాలరాజు గారి శ్రీనివాస్, మైనారిటీ నాయకులు బషీర్, పత్తి శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లా పిఆర్టియు ఐఈఆర్పి యూనియన్ క్యాలెండర్‌ను యూనియన్ జిల్లా అధ్యక్షులు దామోదర్‌రెడ్డి సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, పిఆర్టియు రాష్ట్ర సహాధ్యక్షులు పుట్ట శ్రీనివాస్ రెడ్డి, ఊర్మిళ, పిఆర్‌టియు బాధ్యులు రమణయ్య, గిరిధర్, ఐఆర్‌పి జిల్లా అధ్యక్షులు చిన్న సాయిలు, కార్యదర్శి మహేందర్, బాధ్యులు రమేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను ఇబ్బంది పెట్టొద్దు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం
- జీపీలకు నిధులు వెనక్కు ఇవ్వాలని డిమాండ్
- హైదరాబాద్ వెల్లకుండా పలువురి నాయకుల ముందస్తు అరెస్ట్





కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న నాయకులు... ఎల్లారెడ్డిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ నిధులను సర్పంచులక తెలియకుండా ప్రభుత్వం ఇతర పనులకు వాడుకుంటూ జీపీలకు ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జీపీల నిధులు రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు తెలియకుండానే వెనక్కు తీసుకోవడంపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమడుగు షరీఫ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ అకౌంట్ నుండి ప్రభుత్వం సర్పంచ్‌ల పర్మిషన్ లేకుండా రాజ్యాంగ బద్దంగా వచ్చిన డబ్బులు ప్రభుత్వం వేరే పనులకు వాడుకొని సర్పంచ్ లను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని అన్నారు. ఇప్పటికే నిధులు లేక పంచాయతీ పాలన అస్తవ్యస్తమ వుతుందని, ఈ క్రమంలో నిధులు ఇవ్వాల్సి ఉండగా.. వచ్చినవి లాక్కోవడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమం లో హరి సత్యం, శివయ్య, సిద్ధు, అర్షత్, రాజు, సంతోష్, లక్ష్మణ్, సంజు, నరేష్, అనిల్, సాయిలు,చాట సాయిలు,ఆనంద్, రవి తేజ, మహేష్ గౌడ్, కమ్మరి కృష్ణ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

తాడ్వాయి : గ్రామపంచాయతీల నిధులు వెనక్కు తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ధర్నా చేపట్టేందుకు హైదరాబాద్ వెళ్తున్న తమను ముందస్తుఅరెసెసినట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దూర్మాగపు పాలనలో నలిగి పోతున్న గ్రామ పంచాయతీల గురించి ఈ ప్రభుత్వాలను ప్రశ్నించడానికి ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో ముందస్తు అరెస్ట్ చేయించి స్టేషన్‌కు తరలించడం సిగ్గుచేటని ఉప సర్పంచ్, యువజన కాంగ్రెస్ నాయకులు గైని శివాజీ అన్నారు.

రామారెడ్డి : రామారెడ్డి మండలంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ధన్సింగ్, అంబాయి ప్రసాద్, కుమ్మరి శంకర్ తదితరులను అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ బస్టాండ్ వద్ద నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నామాల రవి, నరసింగరావు, గిర్ని రాజేందర్, గంగారెడ్డి, జగన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జీపీలకు వెంటనే నిధులు చెల్లించాలి

రాజంపేట్ : జీపీల నుంచి వెనుక్కు తీసుకున్న నిధులను వెంటనే జీపీల ఖాతాల్లో జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి డిమాండ్ చేశారు. సర్పంచుల నిధులు కేసీఆర్ ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు ముఖ్యంగా 15 వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించి ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నందుకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు హాజరు కాకుండా అర్ధరాత్రి రాజంపేట పోలీసులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారన్నారు. వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచులకు చెల్లించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకో చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి సర్పంచ్ కొమ్ము యాదగిరి, పట్టణ అధ్యక్షులు రంగ గంగాధర్ గౌడ్, మండల యువజన అధ్యక్షులు అంకం కృష్ణారావు తదితరులను పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ యూత్ కాంగ్రెస్ గుడుగుల శ్రీనివాస్, మైనార్టీ పట్టణ ప్రెసిడెంట్ సిరాజ్,రాజు, శ్రీను, వెంకటేష్, గణేష్, జమీల్, సర్వర్, సందీప్, హన్మాండ్ల రవి, హైమత్, ముకుందాం, లఖపతి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులను వెంటనే విడుదల చేయాలి

ఎల్లారెడ్డి : గ్రామ పంచాయతీల 15 వ ఆర్థిక సంఘం నిధులను విడుదల వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజక వర్గ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం కెసిఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. సర్పంచ్ లకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, రాష్ట ప్రభుత్వం నిర్లక్ష్యం పై ఇందిరా గాంధీ పార్క్ వద్ద జరగాల్సిన ధర్నాకు ప్రభుత్వము నిరాకరించింది అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హఫీజ్, వైస్ ఎంపిపి నర్సింలు, నాయకులు గోవింద్, పరండములు, కశీరం తదితులున్నారు.

భిక్కనూర్ : మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీం రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, లింగ రెడ్డి, స్వామి, సాజిత్, నాగరాజు, కిరణ్, సుధకర్ తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు..



రాజంపేట్‌లో ముందస్తు అరెస్ట్



భిక్కనూర్‌లో నాయకుల ముందస్తు అరెస్ట్

108 అంబులెన్స్‌లో ప్రసవం



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్ గ్రామానికి చెందిన రేకుల అంజలి (గర్భిణీ)కి పురిటి నొప్పులు రావటంతో వెంటనే ఆమె కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న108 సిబ్బంది గర్భిణిని ప్రసవం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. తల్లి, బిడ్డను బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీకాంత్, అంబులెన్స్ డ్రైవర్ అసిఫ్‌ను అభినందించారు.

4న ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా యువతీయువకులకు ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. జిల్లా క్రీడా యువజన విభాగం, నెహ్రూ యువ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సూచనలు చేశారు. 15ఏండ్లనుంచి 29 లోపు వయసువారు అర్హుని, మూడునిమిషాల్లోపే ఉపన్యాసన్ని పూర్తి చేయాలని తెలిపారు. దేశ భవిష్యత్తు లో యువత, ప్రజాస్వామ్య పరిరక్షణ పరిపాలనలో యువత పాత్ర, డిజిటల్ ఇండియా ఇలా పలు అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయికి, అక్కడ గెలిస్తే జాతీయస్థాయికి వెళ్తారని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని నూతన అంబేద్కర్ భవన్‌లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 9100435410 సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో
జిల్లా పేరు నిలపాలి

- హ్యాండ్ బాల్ జిల్లా హడాక్ కమిటీ కన్వీనర్ పింజ సురేందర్
- జిల్లా హ్యాండ్ బాల్ జట్ల శిక్షణ శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా హ్యాండ్ బాల్ హడాక్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో జిల్లా జూనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ జట్లకు శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైందని జిల్లా హ్యాండ్ బాల్ హడాక్ కమిటీ చైర్మన్ గంగా మోహన్ చక్రు తెలిపారు. బాలుర జట్టుకు వసతి భోజన సదుపాయం కల్పిస్తున్న జూనియర్ కాలేజ్ దుర్గారెడ్డి , బాలికలకుభోజన వసతి కల్పిస్తున్నటువంటి శ్రీ రాఘవేంద్ర కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్ బాల్ హడాక్ కమిటీ కన్వీనర్ పింజ సురేందర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీల్లో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కో కన్వీనర్ రాజేష్ క్రీడాకారులకు శిక్షణనిస్తున్నటువంటి హ్యాండ్ బాల్ కోచ్ రాజేశ్వర్ స్థానిక పాఠశాల పి.ఈ.టి.రాజేందర్, ప్రవీణ్, కత్తి సీను పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

4న జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 4న ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ మామిడిపల్లి, ఆర్మూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించబడుతుందజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్ (కామారెడ్డి, నిజామాబాద్) జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 02.01.2003 తర్వాత పుట్టిన వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12వతేదీ నుండి 14వ తేదీ వరకు ఖమ్మం జిల్లా బోనకల్లులో జరిగే 67వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని. ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తికి రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

బీజేపీ వారు అయినందుకే సంక్షేమ ఫలం ఇవ్వలేదు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కల్యాణలక్ష్మి లబ్ధిదారులు బీజేపీకి చెందినవారు అయినందుననే సంక్షేమ ఫలం ఇవ్వలేదని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులాచారి అన్నారు. డిచ్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణికి తరలివచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కేవలం టీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తులకే చెక్కులు పంపిణీ చేసి, బీజేపీ పార్టీ వారి చెక్కులను ఇవ్వడంలో పార్టీ మారుమనడం విడ్డూరమని అన్నారు. బీజేపీ పార్టీవారు గనుక చెక్కులను నిలిపి వేస్తున్నారని చెప్పడం దారుణమని అన్నారు. నిబంధనల ప్రకారం ఎంపికైన లబ్దిదారులకు చెక్కులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు రవి, ఇందల్వాయి మండల అధ్యక్షుడు నాయుడి రాజన్న, రూరల్ కన్వీనర్ అనంత పద్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్




సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రామాలఅభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని లేదని ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబాటు వేణు రాజు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం సర్పంచులకు నిధులు విడుదల నిర్లక్ష్యం పై టిపిసిసి రాజీవ్ గాంధీ సంఘటన్ ఆధ్వర్యంలో ఇందిర పార్క్ వద్ద చేస్తున్న ధర్నాకు వెళ్లకుండా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిధుల విషయంలో సర్పంచులకే అధికారం ఉండాలని నేరుగా కేంద్రం నుండి గ్రామపంచాయతీలకే నిధులు అందించిందన్నారు. పంచాయతీలకు రావలసిన నిధులను దారి మళ్లిస్తూ గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటుందని, తమ సొంత డబ్బుతో గ్రామాల్లో అభివృద్ధి చేసిన సర్పంచులకు నిధులు మంజూరు చేయడం లేదని, దీని ద్వారా ఎందరో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని, సర్పంచులకు నిధులు విడుదల చేయాలని వేణు రాజ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు సుభాష్. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రమోద్, జాదవ్, శోభన్, అవీణ్, మోయిన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సయ్యద్ హర్షఫ్, నిఖిల్ రెడ్డి, వర్షిత్, రాహుల్,38 డివిజన్ ప్రెసిడెంట్ వహీద్, డీసీసీ డెలిగేట్ పవన్, సన్ని గౌడ్,రాహుల్, బొట్టు సాయి పాల్గొన్నారు.

సమాచార చట్టం తేవడంలో కీలకపాత్ర



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సమాచార చట్టం తేవడంలో కామ్రేడ్ బర్ధన్ కీలకపాత్ర పోషించారని సీపీఐ నాయకులు కే.భూమయ్య, పి.సుధాకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో కామ్రేడ్. బర్ధన్ 7వ వర్ధంతి సభ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కే.భూమయ్య, పి.సుధాకర్ మాట్లాడుతూ.. కామ్రేడ్.బర్ధన్ మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో శాసనసభ్యులుగా, ఏఐటీయూసీ కార్మిక సంఘం బొంబాయిలో అనేక రంగాలను ఏర్పాటు చేశారని అన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని, 2004లో యూపీఏ-1 కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార చట్టం తేవడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సమసమాజ నిర్మాణం ఆయన ఆశయమని, ఇందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఏ.విటల్ గౌడ్, ఆర్.రఘురాం, రంజిత్, బండి. నారా గౌడ్, పండరిగౌడ్, సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్టు

నవతెలంగాణ-బోధన్/కోటగిరి

పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు హైదరాబాదులో సర్పంచుల నిధుల విడుదల సమస్యలపై సోమవారం ఇందిర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తున్న బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి బోధన్ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యలపై చేపడుతున్న ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్ లకు వచ్చే నిధులను ఇస్తే ఈ ధర్నాలు ఉండవన్నారు. ఎంతోమంది సర్పంచులు నిధులు రాక తమ సొంత డబ్బులను ఖర్చుపెట్టి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఇవి ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని అన్నారు. వెంటనే సర్పంచులకు రావాల్సిన నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో టౌన్ ప్రెసిడెంట్ పాషా మోహినోద్దిన్, కౌన్సిలర్ దాము, మైనార్టీ ప్రెసిడెంట్ కలీం, జనరల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సాయిలు, జహీర్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్



కోటగిరిలో అరెస్టయిన నాయకులు

కోటగిరి: పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం కాంగ్రెస్ పార్టీ ధర్నాకు పిలుపునివ్వడంతో సోమవారం కోటగిరి ఎంపీటీసీ మనోహర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాధర్ దేశాయ్, వహీద్, అయూబ్, తదితరులను అరెస్టు చేశారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన ఆర్డీవో, పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

పీఆర్టీయూ క్యాలెండర్‌ను సోమవారం బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు వారి విధి నిర్వహణతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఈ సంవత్సరం మరింత కష్టపడి పనిచేసి ఉద్యోగులుగా ప్రశంసలు అందుకోవాలని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ శంకర్, బోధన్ అర్బన్ అధ్యక్షుడు కైరాన్, రూరల్ ప్రధాన కార్యదర్శి ధనరాజ్, అర్బన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బసవరాజ్, హనుమంతు, రాష్ట్ర కార్యదర్శి రాజప్రసాద్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు కిషోర్, చందు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కుర్దుల్ పేట్ గ్రామ పరిధిలోని లక్ష్మీ చెరువులో గతనెల 31న చేపల వేటకు వెళ్లి గల్లంతైన మైలారం గ్రామ యువకుడు సంతోష్ (40) సోమవారం లభ్యమైంది. బాసర గజ ఈతగాళ్లా సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. మూడు రోజులు శవం నీటిలో ఉండటంతో పూర్తిగా చెడిపోయిందన్నారు. మృతుని మానసిక స్థితి బాగాలేదని, గతంలో పలుమార్లు ఇంటినుండి బయటకు వెళ్లిపోయాడని, ఇప్పుడుకుడా అదే జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారని తెలిపారు. . భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి శవం లభ్యం

నవతెలంగాణ- రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి పుష్కర ఘాట్ వద్ద చేపల వేటకు వెళ్లిన మిద్దె నరేష్ (30) శవం సోమవారం లభ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. రెండు రోజుల కిందట చేపల వేటకు వెళ్లిన నరేష్ ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందాడు. రెండు రోజులు గాలింపు చర్యలు చేపట్టగా శవం బయటకు వచ్చిందని ఆయన అన్నారు. తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆదర్శ పాఠశాల ఆవరణ చదును

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణను ట్రాక్టర్ తో చదును చేసినట్లు ప్రిన్సిపల్ బలరాం, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మమ్మాయి నాగరాజు పేర్కొన్నారు. ఆవరణ మొత్తం గడ్డి మొలవడంతో ఎమ్మెల్యే సహకారంతో పనులను చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. వారి వెంట వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు సాయిలు తదితరులు ఉన్నారు.

గురుకులంలో అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో అభివృద్ధి పనులకు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డితోపాటు ఉపాధ్యాయలు సోమవారం భూమి పూజ నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర శర్మ దాతగా ముందుకు వచ్చి తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు గాను సుమారు నాలుగు లక్షలతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సుమారు 600 మంది బాలికలు విద్యాబోధన చేస్తున్నందున తాగునీటికి ఇబ్బందులు లేకుంటే చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 40 నుండి 50 వేల మిల్లీమీటర్ల వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సువాసినీ రెడ్డి చెప్పారు. దాతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధురి, గౌతమి, బాబు కిరణ్, శంకర్ గౌడ్, ఎడపల్లి ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ అధ్యక్షులు కదం ప్రకాష్ రావు, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు పోశెట్టి, పాత్రికేయులు దయాకర్, ఎడపల్లి మాజీ సర్పంచ్ మానికోల్ల ఎల్లయ్య యాదవ్, పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

26 కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చొద్దు

బీసీఏ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆంధ్ర ప్రాంతానికి చెందిన 26 కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చకూడదని బీసీఏ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతానికి చెందిన 26 కులాలను తెలంగాణ బీసీ జాబితా నుండి తొలగించిందన్నారు. ఆ తొలగింపు సహేతుకమైందని అప్పటి ఉమ్మడి హైకోర్టు సమర్ధించిందని తెలిపారు. ఆంధ్ర ప్రాంతానికే పరిమితమైన ఆ 26 కులాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ బిసి జాబితాలో చేర్చకూడదని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు 26 కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చడానికి సానుకూలంగా స్పందించారని. అలాంటి పార్టీలకు బీసీల మద్దతు ఉపసంహరించి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఆర్ సాయిలు, కార్యనిర్వాహక అధ్యక్షులు వై అనిల్ కుమార్, కార్యదర్శి జె సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు ఎమ్ రాజు, బి గోపి, కోశాధికారి పి రమేష్ నాయకులు అడ్వకేట్ రవికుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు మంత్రి, ఎమ్మెల్యేల శుభాకాంక్షలు

- జడ్జీకి శుభాకాంక్షలు తెలిపిన సీపీ
- సీపీని కలిసిన నాయకులు, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

నూతనసంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకుని కోర్టు కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా జడ్జి కుంచాల సునితకు నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కె.ఆర్. నాగరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో పలువురు నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కె.ఆర్. నాగరాజుకు పూల మొక్కలు, నోట్‌బుక్స్, పుష్పగుచ్చాలు ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రవిరాజు పబ్లిక్ ప్రాసిక్యూటర్, లక్ష్మీ నర్సయ్య - డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, రహీమ్ ఉద్దీన్ - అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, రాజేష్ గౌడ్ - అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, కవితా రెడ్డి- అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, బి. శ్రీనివాస్-(ఎ.ఓ) కమిషనర్ కార్యాలయం, సూపరింటెండెంటు సిబ్బంది, ప్రదీప్ - రాష్ట్ర అధ్యక్షులు ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్,మోహన్- జిల్లా మాల మహానాడు అధ్యక్షులు,షేక్ సాబిక్-ఆర్ఎస్ఈసి మెంబర్, ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్, వివిధ విభాగాల అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ప్రగతిభవన్లో సోమవారం కలిశారు. పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్మూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ను పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి సోమవారం ప్రగతి భవన్‌లో కలిశారు. ఆయనకు పుష్ప గుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



జడ్జికి మొక్కను అందిస్తున్న సీపీ



పుష్పగుచ్చం అందిస్తున్న మంత్రి



పుష్పగుచ్చం అందిస్తున్న జీవన్‌రెడ్డి

4న ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 4 న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డ్స్ (ఎస్బిఐ క్రెడిట్ కార్డ్స్) నిజామాబాద్ జిల్లా బ్రాంచ్ రిలేషన్‌షిప్, ఎగ్జిక్యూటివ్ (బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్) 2. డేటా ఎంట్రీ ఆపరేటర్స్, టెలికాలర్‌కోసం ఉద్యోగ మేళా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్హత ఇంటర్, డిగ్రీ ఉండాలని, వయోపరిమితి 18 సం'ల నుండి 30 వరకు ఉండాలని తెలిపారు. వివరాలకు 9959456793, 9581768413 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10-00 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు శివాజీ నగర్ నిజామాబాద్‌లో బయో డేటా, ఆధార్ కార్డు, 3 పాసుపోర్టు సైజు ఫొటోలు, సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

కమ్మసంఘం నూతన కార్యవర్గాన్ని రద్దుచేయాలి

నవతెలంగాణ-ముగుపాల్

ఉమ్మడి జిల్లా కమ్మ సంఘ నూతన కార్యవర్గం సభ్యులకు, చైర్మెన్‌కు ,ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇవ్వకుండా జరుపుకున్నారని, ఈ కార్యవర్గాన్ని, జిల్లా అధ్యక్ష పదవిని రద్దు చేయాలని కమ్మ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం మాధవనగర్‌లోని కమ్మ సంఘంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లేకుండా ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఎన్నికలు ఎలా జరుపారని ప్రశ్నించారు. కనీసం తాత్కాలికంగా అధ్యక్షులు, జిల్లా ప్రధాకార్యదర్శి లేరని, నూతన కమిటీని ఏర్పాటు చేయాలన్న, ఎవరిని తీసేయలన్నా అధ్యక్ష కార్యదర్శులకే ప్రధాన భాధ్యత ఉంటుందన్నారు. లక్ష్మిని అధ్యక్షులు గా చేయడం ఎంత వరకు సమంజసమని, ఆమె ఓ కో ఆప్షన్ సభ్యులు అయి ఉండి కూడా అధ్యక్ష పదవి ఎలా ఇచ్చారని అన్నారు. ఈ నెల 8 న సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ప్రతీ ఒక్కరూ వచ్చి ఎన్నికలపై చర్చించుకుని నూతన కార్యవర్గం ఎన్నుకుందామని తెలిపారు. ఉమ్మడి జిల్లా కమ్మ సంఘంలో 1600 మంది ఉన్నారని, వీరిలో15 మంది సభ్యులు ఉండగా నూతన కార్యవర్గంలో ఎంత మంది వచ్చారో ఆయన వివరించారు. అధ్యక్షున్ని, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుందామని రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మండవ రామ కృష్ణ వివరించారు. సమావేశంలో కమ్మ సంఘం జాయింట్ సెక్రటరీ సురేష్. కమ్మ సంఘం డైరెక్టర్లు గుండు రాము, రవీంద్రనాథ్. ఠాగూర్, మండవ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు